

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 01.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 101 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## సెప్టెంబర్ 5న ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

- ఉద్యోగుల సమస్యలపై సమగ్ర చర్చ.. భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం
- పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఇతర డిమాండ్లపై ప్రధానంగా చర్చ
- చర్చల ద్వారానే సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత
- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రాజీలేని వైఖరి
- ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ స్పష్టీకరణ



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ జేఏసీ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం సెప్టెంబర్ 5న విజయవాడ ఎన్జీవో హోంలో నిర్వహించనున్నట్లు ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ సెక్రటరీ జనరల్ కె ఎస్ ఎస్ ప్రసాద్ లు ప్రకటన లో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఏర్పాటు చేసిన నూతన కమిటీల సభ్యుల పరిచయం, ప్రెసిడెన్షియల్ ఆర్డర్-2025పై సమగ్ర చర్చ, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏలు, ఇతర ఉద్యోగుల డిమాండ్లు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలు సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు..

రాష్ట్ర జేఏసీ నాయకులతో పాటు అనుబంధ సంఘాల రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల జేఏసీ ప్రధాన ప్రతినిధులు సమావేశంలో పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ సంఘాల స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు, మంత్రుల బృందం సమావేశంలో జరిగిన చర్చల అనంతరం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో త్వరలో సమావేశం ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాల ప్రతినిధులను ఆహ్వానించి, పెండింగ్ సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చలు, సంప్రదింపుల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎ. విద్యాసాగర్ అన్నారు. బాధ్యతాయుతమైన ప్రధాన వ్యవస్థగా సంఘంగా చర్చిలో సానుకూల వాతావరణంలో జరిగేటట్లు ఒక ప్రణాళిక అబద్ధంగా బాధ్యతతో వ్యవహరిస్తున్నామని, చర్చలు పూర్తిగా విఫలమైన పరిస్థితుల్లో మాత్రమే ఉద్యమ కార్యాచరణ అనివార్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం-ఉద్యోగుల మధ్య సానుకూల వాతావరణం కొనసాగుతోందని, ప్రభుత్వం ఉద్యోగుల మధ్య ఈ వాతావరణం రాష్ట్ర అభివృద్ధికి ప్రజలకు మరింత మంచి సర్వీసులు అందించడానికి దోహదపడుతుందని విద్యాసాగర్ తెలిపారు.

**పీఆర్సీ, డీఏలపై తక్షణ దృష్టి సారించాలి:** పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఇతర ఆర్థిక బకాయిల విషయంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపశమనం కల్పించేలా ప్రభుత్వం ఈ అంశాలపై అత్యవసరంగా దృష్టి సారించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలమైన ప్రభుత్వంగా వ్యవహరించడంతో పాటు ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు కూడా బాధ్యతాయుతమైన ధోరణితో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తారని ఎ. విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగులను కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**న్యాయమైన డిమాండ్లపై రాజీ లేదు.. అవసరమైతే ఉద్యమమే:** ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల విషయంలో ఏపీ జేఏసీ రాజీలేని వైఖరితో ముందుకు సాగుతుందని, అదే సమయంలో రాష్ట్రంలోని ప్రధాన ఉద్యోగ సంఘంగా బాధ్యతాయుతమైన విధానంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యల పరిష్కారానికే తమ తొలి ప్రాధాన్యత అని, అయితే అవసరమైన పరిస్థితుల్లో ఉద్యమ కార్యాచరణకు వెనుకాడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలో జరిగిన 14 ప్రధాన ఉద్యోగుల సమ్మెలకు ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకత్వం వహించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ప్రభుత్వం వారు ఇరవై రెండు వేల కోట్ల బకాయిలు చెల్లింపు, ఒకటో తారీఖున జీతాలు చెల్లింపు, 11 వేల మంది ఉద్యోగులకు ఓపిఎస్ వర్తింపు, 8000 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, పదవి విరమణ వయసుని ప్రభుత్వ రంగ సంస్థలకు గురుకుల పాఠశాలకు 60 నుంచి 62 పెంచడం, అంగన్వాడీలకు ప్రభుత్వ పథకాలు భాగస్వామ్యం చేయడం అంటే నిర్ణయాలు తీసుకున్నప్పటికీ ఉద్యోగుల పిఆర్సిడిఏ తదితర ఆర్థిక అంశాలలో ముందుకు రావలసిన బాధ్యత ప్రభుత్వం దేని అన్నారు.

**సానుకూల స్పందనపై విశ్వాసం.. లేకుంటే ఉద్యమ కార్యాచరణ :** ప్రస్తుతం ప్రభుత్వం సానుకూల దృక్పథంతో స్పందించి ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరిస్తుందనే విశ్వాసం తమకు ఉందని ఎ. విద్యాసాగర్ తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తదుపరి ఉద్యమ కార్యాచరణపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

## ఇన్నర్ రింగ్ రోడ్ మూడో దశ పనులు వేగవంతం





- శిల్పారామం-పెదపలకలూరు మధ్య 4.25 కి.మీ.
- రూ.48 కోట్లతో మూడో దశ పనులు
- పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరణకు ప్రతిపాదన

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** నగరంలో కీలకమైన మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ మూడో దశ పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు 4.25 కిలోమీటర్ల మేర చేపడుతున్న రహదారి పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ రహదారి నిర్మాణానికి రూ.48 కోట్లు మంజూరు చేసినట్లు పెమ్మసాని తెలిపారు. గతంలో పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ ముందుకు సాగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారి పరిధిలోని ఆక్యుపెంట్ల పునరావాసం, ఇతర సమస్యలను పరిష్కరించి పనులకు మార్గం సుగమం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయని, నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

రహదారి నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో ఎత్తు పెంచాల్సి రావడంతో విద్యుత్ అధిక వోల్టేజీ తీగలను మార్చాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఇందుకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు అదనపు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. జాతీయ ఉపరితల ప్రాజెక్టు కాలువల వద్ద భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా అదనపు కల్వర్టులు నిర్మించాల్సి ఉందని, ఒక్కో కల్వర్టుకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వ్యయం కావచ్చని చెప్పారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా వీలైనంత వరకు ఈ పనులను ప్రస్తుత ప్రాజెక్టులోనే చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు తెలిపారు.

**పేరేచర్ల వరకు విస్తరణ :** భవిష్యత్తులో ఇన్నర్ రింగ్ రోడ్డును కొత్తగా నిర్మించనున్న రైల్వే వంతెన మీదుగా పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని పెమ్మసాని తెలిపారు. ఈ విస్తరణ పూర్తయితే పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా అమరావతికి మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని చెప్పారు.

ఈ విస్తరణకు సుమారు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అదనపు వ్యయం అవుతుందని అంచనా వేశామని, నిధుల కోసం ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. అయితే ఈ ప్రతిపాదనకు ఇంకా ఆమోదం లభించలేదని స్పష్టం చేశారు.

**అభివృద్ధికి ఊతం :** ఇన్నర్ రింగ్ రోడ్ పూర్తయితే చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మాణ, వాణిజ్య కార్యకలాపాలు మరింత ఊపందుకుంటాయని పెమ్మసాని అన్నారు. ఇప్పటికే కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, ఫలితంగా భూముల విలువలు పెరుగుతున్నాయని తెలిపారు. రానున్న రెండు, మూడేళ్లలో అభివృద్ధి మరింత విస్తరిస్తే నగర పాలక సంస్థకు ఆదాయం పెరగడంతో పాటు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ పరిధిలోనూ మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

గుంటూరు నగరంతో పాటు అమరావతి, పల్నాడు ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేలా ఇన్నర్ రింగ్ రోడ్ పనులను వేగంగా పూర్తి చేయడమే లక్ష్యమని పెమ్మసాని తెలిపారు. రహదారి నిర్మాణంతో పాటు అవసరమైన మురుగునీటి కాలువల మూతలు, మధ్యలో విద్యుత్ దీపాలు వంటి సదుపాయాలను కూడా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

## ఈ-13కు జాతీయ రహదారి-16తో లింకు!

- ఎయిమ్స్ భూమి కేటాయింపునకు కేంద్రం సూత్రప్రాయ ఆమోదం
- 3.34 ఎకరాలు రహదారికి.. ప్రత్యామ్నాయంగా 10 ఎకరాలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : మంగళగిరి ఎయిమ్స్ పరిధిలోని 3.34 ఎకరాల భూమిని ఈ-13 రహదారి విస్తరణకు కేటాయించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ-13ను జాతీయ రహదారి-16తో అనుసంధానించే మార్గం నిర్మాణానికి భూసమస్య అడ్డంకిగా ఉండగా.. తాజా నిర్ణయంతో అది తొలగే అవకాశం ఏర్పడింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భూమి కేటాయింపునకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది.

**ప్రత్యామ్నాయంగా 10 ఎకరాలు :** రహదారి నిర్మాణానికి తీసుకునే 3.34 ఎకరాలకు బదులుగా 10 ఎకరాల ప్రత్యామ్నాయ భూమిని ఎయిమ్స్ మంగళగిరికి కేటాయించాలని కేంద్రం సూచించింది. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో భూమిని త్వరగా గుర్తించి ఎయిమ్స్‌కు అప్పగించే ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. భూమి అప్పగింత పూర్తయిన తర్వాత వివరాలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు తెలియజేయాలని ఆదేశించింది.

**కనెక్టివిటీ మరింత మెరుగు :** ఈ-13 రహదారిని జాతీయ రహదారి-16తో అనుసంధానించడం ద్వారా మంగళగిరి-గుంటూరు ప్రాంతాలకు రహదారి కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది. ఎయిమ్స్‌కు రాకపోకలు సులభతరం కావడంతో పాటు జాతీయ రహదారికి నేరుగా అనుసంధానం ఏర్పడుతుంది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రాంతంలో రవాణా మౌలిక వసతులు బలోపేతం కానున్నాయి.

**పెండింగ్ భూమిపైనా చర్యలు :** ఎయిమ్స్ మంగళగిరికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన సుమారు 183 ఎకరాల్లో ఇంకా 6.04 ఎకరాల భూమి హద్దుల నిర్ధారణ, అప్పగింత ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. దీనినీ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది. రెండు భూసంబంధిత అంశాలు పరిష్కారమైతే ఎయిమ్స్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత వేగం పుంజుకోనుంది.

**సమన్వయంతో పరిష్కారం :** ఈ-13ను జాతీయ రహదారి-16తో అనుసంధానించే ప్రాజెక్టుకు అవసరమైన భూసమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పరిష్కరిస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

## 25 ఏళ్ల నిబద్ధతకు దక్కిన గౌరవం

- పార్టీకి అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు తప్పదు
- అవకాశాలు ఆలస్యమైనా ఆశయాన్ని వీడకుండా పనిచేస్తే ఫలితం
- నూతన ఎమ్మెల్సీ వర్ల రామయ్య సన్మాన సభలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** రాజకీయాల్లో పదవుల కోసం కాకుండా ఆశయాల కోసం పనిచేస్తూ, పార్టీకి నిబద్ధతతో అంకితమైన వారికి గుర్తింపు తప్పక లభిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అవకాశాలు ఆలస్యమైనా ఓర్పు, సహనం, నిరీక్షణతో పనిచేస్తే తగిన సమయంలో పార్టీ గుర్తింపు ఇస్తుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎల్ఐడీక్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆధ్వర్యంలో నూతన ఎమ్మెల్సీ వర్ల రామయ్యను సన్మానిస్తూ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పెమ్మసాని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఉప పరిశీలకుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన వర్ల రామయ్య డీఎస్పీ స్థాయికి ఎదిగారని, అనంతరం 2001లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి వచ్చారని పెమ్మసాని తెలిపారు. ఆ తర్వాత పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేయడం, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించడం, ప్రతిపక్షంలో ప్రజా సమస్యలపై గళమెత్తి పోరాడటం వంటి పలు బాధ్యతలను సమర్థంగా నిర్వహించారని చెప్పారు. సుమారు 25 ఏళ్లపాటు పార్టీ కోసం విలువైన సమయాన్ని త్యాగం చేసిన వర్ల రామయ్య ప్రస్థానం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.

**ఓర్పు, నిబద్ధతకు పట్టాభిషేకం :** వర్ల రామయ్యలోని సహనం, ఓర్పు, నిరీక్షణ, నిబద్ధత, విధేయతకు ఈ సన్మాన కార్యక్రమం పట్టాభిషేకం వంటిదని పెమ్మసాని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఏ ఆశయంతో అడుగుపెట్టారో, ఆ ఆశయాన్ని మధ్యలో వదిలిపెట్టకుండా కొనసాగించారని తెలిపారు. పదవులు, అవకాశాలు వెంటనే రాకపోయినా పార్టీని వీడకుండా నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేస్తే ఆలస్యమైనా గుర్తింపు లభిస్తుందని ఆయన ప్రస్థానం నిరూపిస్తోందన్నారు.

పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు వర్ల రామయ్య జీవితం స్ఫూర్తిదాయకమని చెప్పారు. రాజకీయాల్లో పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, కొన్నిసార్లు అవకాశాలు ఆలస్యం కావచ్చని, అయితే నిబద్ధతతో పనిచేసేవారికి తగిన సమయంలో పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన నాయకులను గుర్తించి బాధ్యతలు అప్పగించడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అని అన్నారు.

**సామాజిక న్యాయానికి పెద్దపీట :** సమాజంలోని అన్ని వర్గాలకు సమాన హక్కులు, రాజకీయ అవకాశాలు కల్పించడం ద్వారా ప్రజలకు గౌరవం, స్వేచ్ఛ, అధికారంలో భాగస్వామ్యం కల్పించడంలో ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని పెమ్మసాని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.

మోత్కుపల్లి నర్సింహులును తెలంగాణలో రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగేలా ప్రోత్సహించడం, ప్రతిభాభారతిని మహిళా స్పీకర్‌గా అవకాశం కల్పించడం, జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా తీర్చిదిద్దడం వంటి అనేక ఉదాహరణలు తెలుగుదేశం పార్టీ సామాజిక న్యాయ విధానానికి నిదర్శనాలని పెమ్మసాని పేర్కొన్నారు. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా ప్రతిభ, అంకితభావం, ప్రజాసేవకు ప్రాధాన్యం ఇస్తూ నాయకత్వ అవకాశాలు కల్పించిన చరిత్ర పార్టీకి ఉందన్నారు.

**పిల్లి మాణిక్యరావుకు కీలక బాధ్యతలు :** ఉద్యమ నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన పిల్లి మాణిక్యరావుకు ఎల్ఐడీక్యాప్ చైర్మన్ పదవితో పాటు గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పార్టీ నాయకత్వం ఆయనపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పెమ్మసాని అన్నారు. కార్యకర్తగా ప్రారంభించి వివిధ స్థాయిల్లో పనిచేసిన వారికి తగిన సమయంలో కీలక బాధ్యతలు అప్పగించే సంప్రదాయం తెలుగుదేశం పార్టీలో ఉందని పేర్కొన్నారు.

పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంపీలతో సమావేశమయ్యే భవనానికి జీఎంసీ బాలయోగి ఆడిటోరియం అని పేరు ఉండటం ప్రతి తెలుగువారికీ గర్వకారణమని పెమ్మసాని అన్నారు. ఒక తెలుగు వ్యక్తి దేశ అత్యున్నత ప్రజాస్వామ్య సంస్థ అయిన లోక్‌సభకు స్పీకర్‌గా పనిచేసిన గుర్తుగా ఆ పేరు నిలిచిపోవడం తెలుగువారి ప్రతిభకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు.

**ఆత్మీయంగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు :** వర్ల రామయ్యను సన్మానించేందుకు వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడం ఆయన పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనమని పెమ్మసాని తెలిపారు. దాదాపు పాతికేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నాయకుడికి ఈ స్థాయిలో ఆత్మీయ స్వాగతం లభించడం ఆయన వ్యక్తిత్వానికి, ప్రజలతో ఉన్న అనుబంధానికి ప్రతీక అని అన్నారు.

**పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు :** వర్ల రామయ్యకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ సహా పార్టీ నాయకత్వానికి పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘకాలం పార్టీ కోసం పనిచేసిన నాయకుడికి తగిన సమయంలో పదవి దక్కడం కార్యకర్తల్లో మరింత నమ్మకాన్ని పెంచుతుందని అన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన వారికి భవిష్యత్తులోనూ తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

నూతన ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన వర్ల రామయ్య శాసనమండలిలో ప్రజా సమస్యలను బలంగా వినిపించాలని, ప్రజలకు మరింత చేరువై సేవలందించాలని పెమ్మసాని ఆకాంక్షించారు. పార్టీ కోసం చేసిన త్యాగం, సుదీర్ఘకాలం కొనసాగించిన నిబద్ధతకు దక్కిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ప్రజలకు, తెలుగుదేశం పార్టీకి మరింత సేవ చేసే అవకాశం ఆయనకు లభించాలని ఆకాంక్షించారు.